# విస్తరాకు

జల్లులు జల్లుగా కురుస్తోంది వర్షం. గుడిసెలో కిరసనాయిలు దీపం- ముసురుకుంటున్న చీకట్లతో పోరాడలేక బిక్కు బిక్కుమని చూస్తోంది. కుక్కి నులక మంచం మీద పడుకున్న గవరయ్య ఇవాళ వుదయం నుంచీ దగ్గుతో ఆయాసంతో మెలికలు తిరిగి పోతూనే వున్నాడు.

పేరితల్లి వాడి దగ్గు వినలేకపోతోంది. వాడి బాధ చూడలేకపోతోంది. పొయ్యిలో ఎండు పుల్లలు వేసి సిల్వరు గిన్నెతో టీ నీళ్ళు మరగబెట్టింది. గ్లాసులో టీ పోసి అతని మంచం దగ్గరికి వచ్చింది నెమ్మదిగా.

''సూడు మాఁవా! టీ తెచ్చాను-కసింత తాగు నిమ్మళిస్తాది పేణం'' అంది గొంతు పెగుల్చుకుంటూ.

గవరయ్య పెళ్ళాం ముఖంలోకి అసహ్యంగా చూసేడు. 'సిగ్గుమాలిన సెట్కారీ నెంజ-తనకి దీని యవారమంతా తెలిసిపోనాక కూడా తనతో ఏం ముఖం పెట్టుకొని మాట్లాడుతోంది?' అనుకుంటూ చీదరించుకున్నాడు.

''మాఁవా!'' దీనంగా పిలుస్తోంది పేరి తల్లి.

''ఏటే!'' కసురుకున్నట్టుగా అరిచేడు గవరయ్య.

''టీ సుక్క తాగవూ?''

''ఛూ! నీ ఎదవ సేతుల్తో యిస్తే యింత యిసం తప్ప మరేటీ తాగను'' అంటూ ముఖం పెచ్చులూడి పోతున్న మట్టిగోడ వేపుకి తిప్పేసుకున్నాడు.

పేరి తల్లి గుండె కలుక్కుమంది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ చీరకొంగు నోట్లో కుక్కుకుంది. టీగ్లాసు బల్ల మీద పెట్టి గుడిసెలో ఓ మూలకిపోయి కూలబడి పోయి చేతుల్లో ముఖం దాచేసుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

'సింహాద్రప్పన్న సామీ! నానేటి సేసాను తండ్రీ? ఎవరి కన్నేయం సేస్సినాను? ఎవరి సంసా... నిప్పులు పోస్సినాను? మావకి కడుపు నిండా యింత కూడెట్టాలని అలా సేసినాను. అంతేకాని, మ... అంటే తన కిష్టం నేదూ! ఆడంటే తనకి పేణంతో సమానం కాదూ!'

రెండేళ్ళ కిందట... ఇజీనారం అమ్మవారి పండక్కి తను, అప్పగోరింటికి సుట్టం సూపు కెళ్ళినప్పుడు.. మాఁవని తోలిసుట్టు అంబటి సత్రం జంక్సను కాడ బూరలమ్ముకుంటూ...

''బూర కావాలేటి-గేస్ బూర? దారం వదిలేస్తే పైకెళ్ళిపోతాది'' అంటూ అదోలా...

తనను. పదిపైసలెట్టి బూరకొంది. బూర తన సేతిలెడుతూ మాంవ తన సెయ్యిగిల్లడం తన కింకా గుర్తే! తన కెంచేతో కోపం రానేదు. మాంవ సెయ్యిగిల్లుతూ నవ్విన నవ్వు తను మరిసిపోతదా ఎప్పటికయినా! అత్తల.ఎన్ని సార్లో ఆ జాతరలో జనం మధ్య మాంవ కనిపిస్తానే వుండేవాడు. తనెల్లిన కాడికి ప్రతీ సోటుకీ వచ్చీవోడు. కొత్తపేట సెంటర్లో- బొంకులు దిబ్బకాడ గంటస్తంబం కాడ- సివరకి, కంటోన్మెంటు సినిమా హాలు కాడ కూడా మాంవ కనిపించీవోడు! 'ఇదే టోలమ్మా!' అని ఆశ్చర్యపోయేది తను. తరువాత తెలిసింది- మాంవ వుండేది తన అప్పగోరింటికి దగ్గర్లోనే అని... బావకి మాంవ బాగా తెలుసుట కూడా! అందుకే తన వెంట పడీవోడన్న మాట!

ఈ సంగత్తెలుసుకుని పొంగిపోయింది తను.

అన్నట్టు-

అమ్మోరి పండుగల్లో మాంవ ఏసకం కూడా కట్టేడు! దొంగోడూ- పోలీసూ ఏసం. వొంటి నిండా రానేసుకున్న మనిసిని తాడుతో కట్టి, ఆ తాడు సేత్తో పట్టుకుని పోలీసు కనిస్టీపు ఏసం కట్టుకొని జోగిదండుకోడాని కొచ్చేడు మాంవ. కాకీ బట్టలేసుకుని, టోపీ పెట్టుకుని, సేతిల వెదురు కర్ర పట్టుకుని అచ్చంగ పోలీసు బాబులాగ ఎంత బాగున్నాడో మావ!

ఆళ్ళమ్మ జబ్బులో- అమ్మోరి జాతర్లో ఏసం కట్టి, జోగిదండి ముడుపుకడతానని మొక్కుకున్నాట్ట మాంవ!

అప్పగోరి యింటి నుంచి తిరిగి తన వూరు వెళ్ళి పోయే ముందు రోజు తనొక్కర్తీ మేట్నీ కెళ్ళింది. అప్పకి పనుండి రానంది. తనొక్కర్తీ ఎల్లింది.

జనం కిక్కిరిసి పోతున్నారు. ఎప్పుడొచ్చేడో మాంవ- మొదటిసారిగా తనని పిలిసేడు.

''ఇదిగో! నిన్నే- టిక్కెట్టు కావాలేటి?'' అని అడిగేడు.

''ఒక్కటి- నేనొక్కర్తినే.'' గొణిగింది భయం భయంగా.

''నా కాడ రెండున్నాయి- నాతో వొస్తావేటి?'' అన్నాడు. ఎంత దయిర్యం! అందుకే ఆడంటే పిచ్చి ప్రేమ కలిగింది తనకి. గుండె దడగడ లాడింది. మాటాడనేదు.

''రా- పర్నేదు''. బలవంతం చేసాడు.

అతనంటే తనకీ యిష్టంగానే వుంది మరి. అతన్తో కలిసి సినిమా చూసింది. సినిమాలో చాలా కబుర్లు చెప్పాడు తనకి. చీకట్లో మీదకి లాక్కుని బుగ్గ కొరికేడు. 'నిన్ను మనువుసేసుకుంటా' అని చెవిలో గుసగుస్లాడేడు. గేస్ బూరలాగ తన గుండె పొంగిపోయింది.

ఆ పరిచయం యిద్దర్నీ ఒక గుడిసెలోకి చేర్చింది. తన మెడలో తాళిగట్టి మాంవ తనని స్వంతం చేసుకున్నాడు! మాంవ అంటే తనకెప్పుడూ యిష్టమే! రోగమొచ్చి, మనిషి పాడయిపోనాడని ఆడి మీద తనకిప్పుడు మనసుండదా?

కాని- కాని- తను తప్పేసేసింది. నిజమే! ఎందుకోసం అలా దిగజారిందో ఆ భగవంతుడికే

తెలియాలి!

మాఁవ జబ్బుమనిస్సై పోయాక కొంప గడవడం కష్టమైపోయింది. కూలీ నాలీ చేసినా కడుపు నిండటం లేదు. దానికి తోడు వొంట్లో బాధ భరించలేక మాఁవ తాగుబోతైపోయాడు. ఎంత వొళ్ళు హూనం చేసుకుని సంపాదించినా చాలడం లేదు! ఒక్కొక్క రోజు కటికి గంజీనీళ్ళకి కూడా కరువైపోతోంది.

తాగడానికి డబ్బులేక- కాలిపోతున్న కడుపుతో మాఁవ పడే బాధనీ, ఆకలితో నకనకలాడిపోతూ మెలి తిరిగిపోతున్న మాఁవ అవస్థనీ చూసి వోర్చుకోలేక పోయేది తను.

అందుకే- తను తప్పు చేసింది- చీకటి తప్పు చేసింది!

ఆ యేళ వర్షం ఎడ తెరిపి లేకుండా పడుతోంది. తను గుడిసెచేరాలని గబగబ నడుస్తోంది. చీకట్లో దారి సరీగా తెలీటం లేదు. ఫెడేల్మని ఎక్కడో పిడుగు పడింది!

మరింక ముందుకు నడవలేక ఓ డాబా యింటి గుమ్మం ఎక్కి నిల్చుంది.

కొంతసేపటికి తలుపులు తెరుచుకున్నాయి.

''ఎంతకని తడిసిపోతూ నించుంటావు-లోపలికి రా'' అని పిలిచేడు తలుపులు తెరిచిన మనిషి.

సంశయంతోనే లోపలికి అడుగుపెట్టింది.

అంతే!

అది మామూలు అడుగు కాదనీ, తప్పటడుగు అనీ తెలుసుకునే సరికి చెయ్యి దాటిపోయింది!

వర్షం వెలిసే సరికి వీధిలో కొచ్చి పడింది. అప్పుడు తన జాకెట్లో తన తడి గుండెల్ని ఒత్తుకుంటూ ఏదిరూపాయల నోటు కాల్చిన ఇనపరేకులా మంటలు రేపింది.

ఆ రాత్రి మాఁవ యిష్టమొచ్చినంత తాగేడు. మాఁవకి కడుపు నిండా కూడు పెట్టగలిగింది. ఆ తృప్తి చాలనిపించింది తనకు.

ఆ తరువాత చాలా సార్లు మాఁవకి కడుపునిండా కూడు పెట్టగలిగిన ఆనందం నిలుపుకోగలిగింది!

ఈ సంగతి మాఁవ చెవిలో ఎవరు పడేసారో- మాఁవ పొద్దుయం నుంచీ తన మీద మండిపడుతున్నాడు. ఐచ్చి మంచినీళ్ళయినా ముట్టుకోవటం లేదు..ఎడ తెరిపి లేకుండా దగ్గుతూనే వున్నాడు.

* * *

చీకటి దట్టంగా కమ్ముకునే వేళకి గవరయ్య అలసిపోయి సొమ్మసిల్లిపొయేడు. 'ఓలమ్మో' అంటూ గొల్లుమంది పేరితల్లి.

''ఆస్పత్రికి తీసికెళ్ళవే పేరి తల్లీ! ఆడు కునకేస్తాడో, ఏటో కర్మ!'' అన్నారెవరో.

పేరితల్లి ఏడుస్తూనే రిక్షా పిలుచుకొచ్చింది. ఎవరో సాయం చేస్తే మాఁవని రిక్షాలోకి చేరవేసి, తనూ రిక్షా ఎక్కింది.

రిక్షా ఓ వీధిలోంచి పోతూ వుంటే పేరితల్లికి డబ్బు సంగతి గుర్తొచ్చింది. తన దగ్గర యిప్పుడు

మూడ్రూపాయిలున్నాయంతే! ఎంత ధర్మాసుపత్రయినా రిక్షాలకీ వాటికీ ఖర్చవుతుంది. ఇవే మూలకి సరిపోతాయి?

ఆ బాబు- ఆ డాబా యింటి బాబు- ఆ బాబుని అడిగితేనో? ఆ బాబు అవసరం తను చాలా సార్లు తీర్చింది. ఇప్పుడు తను ఆపదలో వుంది. ఆ మాత్రం సాయం చెయ్యడూ- అనిపించింది పేరితల్లికి.

ఆ యింటి ముందు రిక్షా ఆపించింది. ఆదరా బాదరాగా దిగింది. అదృష్టమే! లోపల ఆ బాబు వున్నాడు.

''రా'' పిలిచేడు - అలవాటుగా, మత్తుగా.

పేరితల్లి గుమ్మం దాటి లోపలికి పోలేదు.

''బాబూ! మాఁవ తెలివి లేకుండా పడిపోనాడు బాబూ! ఆడి పేణం కడతేరిపోతాదేటోనని బయంగ వుంది బాబూ, ఆడ్ని కాపాడాలండయ్యా! నా సేతిల డబ్బుల్లేవు. పదో, పాతికో యిప్పించండి బాబూ!'' అంది బ్రతిమాలుతూ.

''మావంటే- నీ మొగుడేనా?'' సంశయిస్తూ అడిగేడతను.

'' ఊఁ!'' తలూపింది పేరితల్లి.

ఎవరి పెళ్ళాన్ని తనిన్ని రోజులుగా అనుభవిస్తున్నాడో చూడాలనే ఆసక్తి కలిగింది కాబోలు- ఆ వ్యక్తి ఆమె మెడ మీదుగా వీధిలోకి తొంగి చూసేడు.

బయట రిక్షాలో ఏదో ఆకారం ముడుచుకుపోయి పడుకున్నట్లుగా వాలిపోయి వుంది.

టేబిలు సొరుగులో నుంచి బేటరీ లైటు తీసి, రిక్షాలోకి వేసాడు. లైటు వెల్తురులో రిక్షాలో మనిషి వేపు పరీక్షగా చూసి దిగ్భ్రాంతి చెంది నిల్చుండి పోయేడు!

మొద్దుబారి పోయిన వేళ్ళు, చప్పి దవడలు, లోతుకుపోయిన ముఖం, పాలిపోయిన పెదాలు- కుష్ఠురోగంతో కుళ్ళిపోయిన శరీరం...

ఆ వ్యక్తికి పేగులు నలిగిపోయినట్లయింది! వీడా- వీడా దీని మొగుడు? తనతో పాటు అనుభవాలు పంచుకునే పేరితల్లి, వీడితో కూడా అనుభవాలు పంచుకుంటుందా?

ఆ ఆలోచన భరించలేక పోయేడతను. విసురుగా పేరితల్లి ముఖం మీదే తలుపులు వేసేసుకున్నాడు.

విస్తరాకులో భోజనం చేసే వ్యక్తి, ఆ విస్తరాకుని తాను ఎంగిలి చేస్తున్నానని భావించడు. కానీ- భోజనం పూర్తయేక మాత్రం ఆ విస్తరాకుని చూడ్డానికే అసహ్యించుకుంటాడు- ఎంగిలి విస్తరాకని చెప్పి ఏవగించుకుంటాడు.

ఈ విషయం తెలుసుకోలేని పేరితల్లి - ఆ బాబు తన ముఖం మీదే అలా తలుపులు ఎందుకు వేసేసుకున్నాడో గ్రహించలేక నిర్ఘాంతపోయింది!

(నీలిమ మాసపత్రిక, 1978)